# కొడుకు చేతిలో తండ్రి హతం..

- అక్కాచెల్లెలుకు కొంత భూమి ఇవ్వడంతో ఘాతుకం
- సిరిసన్నగూడెంలో ఘటన
- పోలీసుల ఆదుపులో నిందితుడు..!


గాయాల వెంకటయ్య మృతదేహం

పాలకుర్తి రూరల్, డిసెంబర్ 17: అక్కా చెల్లెళ్లకు వ్యవసాయ భూమి పంచి ఇచ్చాడనే కోపంతో తండ్రిని హతమార్చిన తనయుడి ఉదంతం పాలకుర్తి మండలం సిరిసన్నగూడెంలో ఆదివారం జరిగింది. ఎస్సై తాళ్ల శ్రీకాంత్, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. సిరిసన్నగూడేనికి చెందిన గాయాల వెంకటయ్య(68)కు నలుగురు కుమార్తెలు, కుమారుడు. వీరిలో కొంతకాలం క్రితం ఓ కుమార్తె మృతి చెందింది. వెంకటయ్యకు ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నెల క్రితం తనకున్న వ్యవసాయ భూమిలో ఇద్దరు కూతుళ్లకు 20 గుంటల చొప్పున పంచాడు. ఈ విషయం నచ్చని తనయుడు గాయాల నర్సయ్య తండ్రిపై కోపం పెంచుకున్నాడు. ఆదివారం వారి వ్యవసాయ భూమి వద్ద గొడవపడి రాయితో దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా విచారణ చేపట్టారు. నర్సయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. మృతదేహాన్ని జనగామ ఏరియా దవాఖానకు పోస్టుమార్టం కోసం తరలించారు. దీనిపై ఎస్సై తాళ్ల శ్రీకాంత్‌ను వివరణ కోరగా తండ్రిని కొడుకు చంపింది వాస్తవమేనని, మృతుడి కూతుళ్లు అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదు స్వీకరించలేదన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్యాయత్నం

రఘునాథపల్లి, డిసెంబర్ 17 : అప్పుల బాధతో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మండలంలోని కోమల్లలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నీల యాదగిరి వ్యవసాయానికి పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు ఎక్కువ కావడంతో ఆవేదనకు గురైన యాదగిరి ఆదివారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని చికిత్స కోసం జనగామలోని ఏరియా దవాఖానాకు తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ప్రైవేటు దవాఖానాకు తరలించారు.

# అయ్యప్ప దర్శనానికి వెళ్లొస్తూ..

- రోడ్డుపై సైడ్‌వాల్‌ను ఢీకొన్న కారు
- ముగ్గురు అయ్యప్ప భక్తుల దుర్మరణం, ఇద్దరికి తీవ్రగాయాలు
- తమిళ నాడు రాష్ట్రంలోని దేవనపట్టి వద్ద ఘటన
- కమలాపురంలో అలుముకున్న విషాదం


సుబ్బయ్యనాయుడు(ఫైల్)


సాంబయ్య(ఫైల్)


వెంకటరాజు(ఫైల్)

మంగపేట, డిసెంబర్ 17 : నలభై ఒక్క రోజు పాటు దీక్ష చేసి, శబరిమలై అయ్యప్ప స్వామి దర్శనం చేసుకొని సంతోషంగా ఇంటికి తిరిగి వస్తున్న అయ్యప్ప భక్తులు మార్గ మధ్యలోనే అనంత లోకాలకు వెళ్లారు. స్వాములు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న వాల్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన తమిళనాడు రాష్ట్రంలోని తెని జిల్లా పెరియాకుళం మండలం దేవనపట్టి బైపాస్ రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. మృతుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు తలారి సుబ్బయ్యనాయుడు(49), నర్రా సాంబశివరావు (51), నిమ్మల వెంకట రాజు(60), జరుపుల రాము, కూనూరు అజయ్ మాల ధరించి 41 రోజుల పాటు దీక్ష పూర్తి చేసుకున్నారు. ఈ నెల 14న గ్రామ పొలిమేరలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఇరుముడులు కట్టుకొని అదే రోజు ఏటూరునాగారానికి చెందిన ఓ అద్దె కారులో శబరిమలై బయలు దేరారు. కాగా, అయ్యప్ప స్వామి దర్శనం పూర్తి చేసుకొని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం తమిళనాడు రాష్ట్రంలోని తెని జిల్లా పెరియాకుళం మండలం దేవనపట్టి బైపాస్ రోడ్డు మీదుగా వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న వాల్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సుబ్బయ్యనాయుడు, సాంబశివరావు, వెంకటరాజు తల, ముఖం భాగాల్లో తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న మరో ఇద్దరిలో కూనూరు అజయ్‌కి ఎడమ చెయ్యి విరగగా, జరుపుల రాముకు గాయాలయ్యాయి. గాయపడ్డ ఇద్దరిని స్థానికుల సహకారంతో స్థానిక దవాఖానలో చేర్పించారు. కాగా, ఒకే గ్రామానికి చెందిన సౌమ్యులుగా పేరున్న ముగ్గురు కారు ప్రమాదంలో మృత్యువాత పడడంతో స్థానికంగా తీవ్ర విషాదం అలుముకున్నది. మండలానికి చెందిన అయ్యప్ప స్వాములు ఇలా ప్రమాదానికి గురి కావడం ఇదే మొదటి సారి. వీరి కుటుంబాలు తీవ్ర విషాదంలో ఉండగా, ఇక్కడి నుంచి కారులో వెళ్లిన అయ్యప్ప స్వాములే పంచనామా ప్రక్రియ పూర్తి చేయించి, మృతదేహాలను తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, ప్రమాద సంఘటన దావనంలా వ్యాపించడంతో మండలంలో విషాదం నెలకొంది.

**పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాలు**

అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన కారు ప్రమాదంలో మూడు కుటుంబాలు తమ ఇంటి పెద్ద దిక్కును కోల్పోయాయి. 17 ఏళ్లుగా అయ్యప్ప మాల ధరిస్తున్న సుబ్బయ్యనాయుడుకి భార్య పార్వతి, ఇద్దరు కుమార్తెలు హర్షిణి, సార్థిక ఉన్నారు. వీరు బీటెక్ చదువుతున్నారు. అలాగే, ఐదేళ్లుగా అయ్యప్ప మాల ధరిస్తున్న సాంబశివరావుకు భార్య శివకుమారి, ఇద్దరు కొడుకులు మనీష్, నితీశ్ ఉన్నారు. వీరు చదువుకుంటున్నారు. కాగా, వెంకటరాజు మాల ధరించడం మొదటి సారి కాగా, ఆయనకు భార్య కాత్యాయిని, ముగ్గురు కూతుళ్లున్నారు. వీరికి వివాహాలు కూడా అయ్యాయి. కొడుకు దుర్గాప్రసాద్ లండన్‌లో చదువుకుంటున్నాడు. కాగా, అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లి సుదూర రాష్ట్రంలో రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో బాధిత కుటుంబాల రోధనలు పలువురికి కలచివేశాయి.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★Wanted Male Councillor for our overseas consultancy (Experience Candidate will be preferred with attractive Salary). Cont: 8106349938, 9849248509.
NTW-321598

★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

# యాసంగి యాక్షన్ ప్లాన్ రెడీ..!

- 1,13,452 ఎకరాల్లో సాగు లక్ష్యం
- గత యాసంగిలో 1,05,625 ఎకరాల్లో పంట
- ఈ సారి పెరుగనున్న వరి సాగు విస్తీర్ణం
- జిల్లాలో కొనసాగుతున్న వరి కోతలు
- నెలాఖరులో నారు మడులకు సన్నద్ధం
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ) : వానాకాలం సీజన్ ముగిసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వరి కోతలు కొనసాగుతున్నాయి. ఈ నెలాఖరు వరకు కోతలు చివరి దశకు చేరుకునే అవకాశం ఉంది. నెల చివరిలో యాసంగి నారు మడులు ఏర్పాటు చేసుకునేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ అధికారులు యాసంగి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. గత యాసంగిలో జిల్లాలో 1,05,625 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ యాసంగిలో 1,13,452 ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్ణయించగా ఈ సారి వరి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని, మక్కజొన్న సాగు విస్తీర్ణం తగ్గనుందని అధికారులు పేర్కొంటున్నారు. రైతులు గత సీజన్‌లో పండించిన పంటల ఆధారంగా వ్యవసాయ శాఖ పంటల అంచనాలను రూపొందిస్తున్నది. ప్రస్తుత యాసంగిలోనూ పంటల సాగుపై అంచనాను తయారు చేశారు.

**95,400 ఎకరాల్లో వరి సాగు అంచనా**

ఈ యాసంగిలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 95,400 ఎకరాల్లో వరి పంట సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. అలాగే 6,500 ఎకరాల్లో మొక్కజొన్న, 350 ఎకరాల్లో పెసర, 75 ఎకరాల్లో మినుములు, 25 ఎకరాల్లో వేరుశనగ, 12 ఎకరాల్లో పత్తి, 90 ఎకరాల్లో నువ్వులు, 150 ఎకరాల్లో జనుము, 50 ఎకరాల్లో శనిగలు, 10,800 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతాయని ప్రణాళికలు సిద్ధం చేశారు. అదే విధంగా గత యాసంగిలో 84,268 ఎకరాల్లో వరి పంట సాగు కాగా, 11,029 ఎకరాల్లో మక్కజొన్న, 58 ఎకరాల్లో పెసర, 40 ఎకరాల్లో మినుములు, 167 ఎకరాల్లో వేరుశనగ, 32 ఎకరాల్లో పత్తి, 71 ఎకరాల్లో నువ్వులు, తొమ్మిది ఎకరాల్లో ఆముదాలు, 80 ఎకరాల్లో జనుము, 31 ఎకరాల్లో శనిగలు, 9,840 ఎకరాల్లో ఇతర పంటలు సాగయ్యాయని తెలిపారు.

**24,458.812 క్వింటాళ్ల విత్తనాలు**

ఈ యాసంగిలో మొత్తం జిల్లాలో 1,13,452 ఎకరాల్లో ఆయా పంటలు సాగవుతాయని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయగా 24,458.812 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉంటాయని అంచనా వేశారు. ఇందులో రైతుల వద్ద 9,584.6 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉండగా, 117.08 క్వాంటాళ్ల విత్తనాలు డిపార్ట్‌మెంట్ దగ్గర, 147,507.132 క్వింటాళ్ల విత్తనాలు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. కాగా, యాసంగిలో 23,850 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా, రైతుల వద్ద 9,540 క్వింటాళ్ల విత్తనాలు ఉన్నాయని, డిపార్ట్‌మెంట్ వద్ద 105 క్వింటాళ్ల విత్తనాలు, డీలర్ల వద్ద 14,205 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలుపుతున్నారు.

**అందుబాటులో ఎరువులు**

యాసంగికి అవసరమైన ఎరువులను అధికారులు సిద్ధం చేశారు. మొత్తం యూరియా 17,017.8 మెట్రిక్ టన్నులు అవసరం అవుతుందని అంచనా వేశారు. అలాగే, డీఏపీ 3403.56 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 3403.56 మెట్రిక్ టన్నులు, పొటాష్ 2269.04 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని ప్రణాళికలు తయారు చేశారు. జిల్లాలో వరి సాగుకు 14,310 మెట్రిక్ టన్నుల యూరియా, 2,862 మెట్రిక్ టన్నుల డీఏపీ, 2,862 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 1,908 మెట్రిక్ టన్నుల పొటాష్ అవసరం అవుతుందని అంచనా వేసి, అందుకు అనుగుణంగా ఎరువులను అందుబాటులో ఉంచారు.

## మేడారం వెళ్లి వస్తుండగా..

- వెంగళాపురం వద్ద చెట్టుకు ఢీకొట్టిన కారు
- ఐదుగురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

తాడ్వాయి, డిసెంబర్ 17 : మేడారం సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వచ్చి తిరుగు ప్రయాణంలో కారు చెట్టుకు ఢీకొట్టిన సంఘటనలో ఐదుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ సంఘటన మండలంలోని వెంగళాపురం వద్ద ఆదివారం రాత్రి జరిగింది. హుస్నాబాద్‌కు చెందిన ఐదుగురు స్నేహితులు అమ్మవర్ల దర్శనానికి మేడారం వచ్చారు. దర్శనం అనంతరం తిరుగుప్రయాణంలో వెంగళాపురం సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. దీంతో ఐదుగురికి గాయాలు కాగా, ఒకరి తలకు తీవ్రగాయం కావడంతో అతడి పరిస్థితి విషమంగా మారింది. గమనించిన స్థానికులు అంబులెన్సు ద్వారా క్షతగాత్రులను ములుగు దవాఖానకు తరలించారు.


మేడిపల్లి వద్ద బోల్తా పడిన బొగ్గు టిప్పర్

## బొగ్గు టిప్పర్ బోల్తా

కాటారం, డిసెంబర్ 17 : మండలంలోని మేడిపల్లి సమీపంలో 353(సీ) జాతీయ రహదారిపై ఆదివారం బొగ్గు టిప్పర్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాడిచెర్ల ఓపెన్ కాస్టు నుంచి టిప్పర్‌లో బొగ్గును భూపాలపల్లికి తరలిస్తుండగా మేడిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో టిప్పర్ అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. కాగా, మేడిపల్లి నుంచి కమలాపూర్ క్రాస్ మధ్య పలు ప్రమాదాలు తరచూ జరుగుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల నివారణకు ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## పారిశుధ్య కార్మికుడి మృతి

సుబేదారి, డిసెంబర్17: గ్రేటర్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుడు మృతి చెందిన ఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి అంబేద్కర్‌నగర్‌కు చెందిన జన్ను మొగిలి(58) శనివారం డ్యూటీకి వెళ్లాడు. తర్వాత సహచర కార్మికులతో కలిసి పెళ్లికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం ఇందిరా నగర్ రోడ్డులో కిందపడి చనిపోయి కనిపించాడు. అతడి మృతికి గల కారణం తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.